క్లుప్తంగా

అభివృద్ధి పనుల పరిశీలన

లాలాపేట: డిప్యూటీ స్పీకర్ పద్మారావు గౌడ్ శనివారం సాయంత్రం లాలాపేటలో ఆకస్మికంగా పర్యటించారు. ప్రొ.జయశంకర్ స్టేడియంలో కొనసాగుతున్న స్విమ్మింగ్ పూల్ జీహెచ్ఎంసీ స్థలంలో కొనసాగుతున్న మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్ పనులను పరిశీలించారు. నిర్ణీత గడువులో పూర్తయ్యేలా పనుల్లో వేగం పెంచాలనీ సంబంధిత కాంట్రాక్టర్‌కు సూచించారు. అభివృద్ధి పనులకు నిధుల కొరత లేదన్నారు. ఆయన వెంట నాగేశ్వర్‌రావు గౌడ్, సునీల్ ముదిరాజ్, మల్లికార్జున్ ఉన్నారు.

జేఎల్ పేపర్-2ను తెలుగులో నిర్వహించండి

ఉస్మానియా యూనివర్సిటీ: జూనియర్ లెక్చరర్(జేఎల్) ఉద్యోగాల రాత పరీక్షలో పేపర్-2 ప్రశ్నపత్రాన్ని తెలుగులో రాసుకునే అవకాశం కల్పించాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు కోరారు. ఈ మేరకు రాష్ట్ర ప్రణాళిక ఉపాధ్యక్షులు బోయినపల్లి వినోద్‌కుమార్‌కు వినతి పత్రం ఇవ్వగా అందుకు ఆయన సానుకూలంగా స్పందించినట్లు నెల్లి సత్య, బాలరాజు, కళ్యాణ్, వినోద్ తెలిపారు.

ఎల్లమ్మ సన్నిధిలో సినీనటి

సనత్‌నగర్: బల్కంపేట ఎల్లమ్మ అమ్మవారిని శనివారం సినీనటి మాధవీలత దర్శించుకున్నారు. ఆలయ పాలక మండలి సభ్యులు ఆమెకు అమ్మవారి దర్శనం చేయించి తీర్థ ప్రసాదాలను అందించారు. పాలక మండలి సభ్యులు ఎం.హనుమంతరావు, నాయకులు మహేష్, సుమన్, కుషల్, శివప్రసాద్ పాల్గొన్నారు.

చర్చి నిర్మాణాన్ని కూల్చడం సరికాదు

చిలకలగూడ : మెట్టుగూడ డివిజన్ ఆలుగడ్డబావిలో నిర్మిస్తున్న బెతెస్ద హౌజ్ ఆఫ్ ప్రేయర్ చర్చిని అక్రమంగా కూల్చివేశారని చర్చి అధికార ప్రతినిధి జాషువ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రేయర్ హాల్ నిర్మాణం కోసం 2016లో జీహెచ్ఎంసీ అనుమతి తీసుకున్నామని, కొంతమంది తప్పుడు ఫిర్యాదులు చేసి కోర్టును ఆశ్రయించారని వివరించారు. కోర్టులో వాయిదాలు కొనసాగుతున్న నేపథ్యంలో ముందస్తు నోటీసులు అందించకుండా జీహెచ్ఎంసీ అధికారులు రెండు అంతస్తులను శుక్రవారం కూల్చివేశారన్నారు. ప్రభుత్వం స్పందించి తప్పుడు ఫిర్యాదులు చేసిన వారికి వత్తాసు పలుకుతున్న అధికారులపై చర్యలు చేపట్టి హాల్ నిర్మాణానికి అనుమతి ఇవ్వాలన్నారు. చర్చి నిర్మాణాన్ని కూల్చివేసి క్రైస్తవుల మనోభావాలు గాయపర్చారని క్రైస్తవ ధర్మ ప్రచార పరిరక్షణ సమితి అధ్యక్షుడు జెరుషలేము ముత్తయ్య, భారత క్రిస్టియన్ కౌన్సిల్ ప్రెసిడెంట్ భాస్కర్ ముల్కల, క్రైస్తవ నాయకులు నీలరాజు శనివారం కూల్చివేసిన ప్రార్థన మందిరాన్ని సందర్శించి సంఘీభావం ప్రకటించారు.

ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య

సనత్‌నగర్: మద్యానికి బానిసైన ఓ యువకుడు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన బేగంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్ఐ సురేష్ వివరాల ప్రకారం..ఓల్డ్ పాటిగడ్డకు చెందిన గుండాల రాహుల్ (25) పెయింటర్‌గా పని చేస్తుంటాడు. మద్యానికి బానిసైన రాహుల్ తరచూ తాను చనిపోతానంటూ ఇంట్లో బెదిరిస్తుండేవాడు. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి వేరే గదిలో పడుకుంటానని చెప్పి వెళ్లిన రాహుల్ తెల్లారేసరికి ఫ్యాన్‌కు చీరతో ఉరేసుకుని మృతి చెందాడు.

పెళ్లి చేసుకుంటానని మోసం

యువకుడిపై కేసు

సనత్‌నగర్: పెళ్లి చేసుకుంటానని నమ్మించి ఓ యువతితో సహజీవనం చేసి మరో యువతితో పెళ్లికి సిద్ధమైన ఓ ప్రబుద్ధుడిపై ఎస్సార్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఇన్‌స్పెక్టర్ సైదులు వివరాల ప్రకారం..ఇందిరానగర్ కాలనీ ఐడీపీఎల్ గుడిసెల సమీపంలో నివసించే యువతి (23) ఓ ఆస్పత్రిలో స్టాఫ్ నర్సుగా పని చేస్తోంది. బోరబండ భవానీశంకర్‌నగర్‌కు చెందిన ఆతం మల్లేష్ (27) ఐదేళ్లుగా ఆమెను ప్రేమిస్తున్నానని, పెళ్లి చేసుకుంటానని 2022 ఏప్రిల్ 29న ఓ బాండ్ కూడా రాసిచ్చాడు. అయితే ఇటీవల పెళ్లి చేసుకోమని యువతి కోరగా అందుకు నిరాకరిస్తూ వస్తున్నాడు. అంతేకాక వేరొక యువతితో వివాహానికి నిశ్చితార్థం కూడా చేసుకున్నాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు మల్లేష్‌పై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశామన్నారు.

గృహోపకరణాల పేరిట టోకరా

చిలకలగూడ : గృహోపకరణాలు విక్రయిస్తానని ఓఎల్ఎక్స్‌లో ప్రకటన ఇచ్చి టోకరా వేసిన ఘటన చిలకలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. సీఐ నరేష్ వివరాల ప్రకారం.. సీతాఫల్‌మండికి చెందిన ఫ్రాన్సిస్ ప్రైవేటు ఉద్యోగి. ఈ నెల 18న ఓఎల్ఎక్స్ చూస్తుండగా ఏసీ, ఫ్రిజ్, వాషింగ్‌మెషిన్, మంచం రూ.52,500 విక్రయిస్తానని ఓ వ్యక్తి ఇచ్చిన ప్రకటన చూసి సంబంధిత ఫోన్ నంబరుకు కాల్ చేశాడు. తాను ఆర్మీ అధికారినని బదిలీ కావడంతో తక్కువ ధరలకే విక్రయిస్తానని చెప్పాడు. ఇద్దరి మధ్య రూ.22,500కు బేరం కుదుర్చుకుని అవతలి వ్యక్తి ఇచ్చిన బ్యాంకు అకౌంట్‌కు డబ్బులు జమ చేశాడు. గృహోపకరణాలు పంపాలంటే మరికొన్ని డబ్బులు వేయాలని ఒత్తిడి తేవడంతో అనుమానం వచ్చి ఆరా తీయగా మోసపోయినట్లు గ్రహించి పోలీసులను ఆశ్రయించాడు.

కంటోన్మెంట్‌లో ఎన్నికల సందడి



పార్టీల మద్దతు కోసం ఆశావహుల ప్రయత్నాలు

- బీఆర్ఎస్, బీజేపీలో పోటీ తీవ్రం
- నామమాత్రంగా మారిన కాంగ్రెస్

కంటోన్మెంట్: కంటోన్మెంట్‌లో ఎన్నికల సందడి మొదలైంది. గత వారమే ఎన్నికల తేదీ ప్రకటిస్తూ కేంద్రం గెజిట్ విడుదల చేసినప్పటికీ పూర్తిస్థాయి షెడ్యూల్ కోసం నేతలు ఎదురు చూస్తూ వచ్చారు. శుక్రవారం బోర్డు అధికారులు షెడ్యూల్ ప్రకటించేందుకు ప్రత్యేక బోర్డు సమావేశం ఏర్పాటు చేయడంతో ఆశావహుల్లో ఉత్సాహం మొదలైంది. ఎవరికి వారే తమ అనుచరగణంతో సమావేశాలు నిర్వహించుకుంటూ ప్రజల్లోకి వెళ్లేందుకు సమాయత్తం అవుతున్నారు. రాజకీయ పార్టీల ప్రమేయం లేకుండానే జరుగుతున్న ఎన్నికలైనా పార్టీల పాత్ర ఇక్కడ కీలకంగా మారనుంది. ప్రధాన రాజకీయ పక్షాలు మద్దతు ప్రకటించిన అభ్యర్థులకే గెలుపు అవకాశాలు మెండుగా ఉంటాయి. గతంలోనే జరిగిన ఎన్నికల్లో ఇదే జరిగింది. ఈ నేపథ్యంలోనే తాజా ఎన్నికల కోసం పలువురు ఆశావహులు ఆయా పార్టీ పెద్దల ఆశిస్సుల కోసం ప్రయత్నాలు ప్రారంభించారు.

పరోక్షంగా పార్టీలే కీలకం

కంటోన్మెంట్ ఎన్నికలు ప్రధాన రాజకీయ పక్షాలైన బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్‌లకు కీలకంగా మారాయి. 2006 ఎన్నికల్లో ఇద్దరు అభ్యర్థుల గెలుపుతో బోర్డులో ఖాతా తెరిచిన బీఆర్ఎస్ కు, 2008లో ఒక్క స్థానం కూడా దక్కలేదు 2014లో నలుగురు మద్దతుదారులు, ఇద్దరు రెబెల్స్ గెలిచారు. తదనంతర పరిణామాల్లో ఇండిపెండెంట్ అభ్యర్థితో పాటు కాంగ్రెస్ అభ్యర్థి కూడా బీఆర్ఎస్‌లో చేరడంతో బోర్డు పూర్తిస్థాయిలో గులాబీవశమైంది. బోర్డు సభ్యుల పదవీకాలం ముగియడానికి కొన్ని నెల ముందే బోర్డు ఉపాధ్యక్షుడి హోదాలోనే రామకృష్ణ బీజేపీలో చేరగా, మరో మాజీ ఉపాధ్యక్షుడు కేశవరెడ్డి సైతం బీజేపీలో చేరారు. ఈ నేపథ్యంలో ఆ రెండు స్థానాలు మినహా మిగిలిన ఆరు వార్డులకు సంబంధించిన తాజా మాజీ బోర్డు సభ్యులకే బీఆర్ఎస్ ప్రాధాన్యమిస్తూ వస్తోంది.

సాయన్న వర్గీయులు సైతం..

గతంలో మహిళలు ప్రాతినిధ్యం వహించిన 3, 4, 7 వార్డులు ప్రస్తుతం జనరల్ కేటగిరిలోకి మారాయి. మూడో వార్డులో అనిత స్థానంలో ఆమె భర్త మాజీ బోర్డు సభ్యుడు ప్రభాకర్, ఏడో వార్డులోనూ భాగ్యశ్రీ స్థానంలో మాజీ బోర్డు సభ్యుడు శ్యామ్‌కుమార్ పోటీకి సిద్ధంగా ఉన్నారు. అయితే నాలుగో వార్డులో వరుసగా గెలిచిన వెంకట్రావు వారసురాలిగా గత ఎన్నికల్లో నళిని బోర్డు సభ్యురాలు అయ్యారు. రెండేళ్ల క్రితం వెంకట్రావు మరణించడంతో ప్రస్తుతం జనరల్‌గా మారిన ఆ వార్డు నుంచి పోటీపై బీఆర్ఎస్‌లో స్పష్టత కరువైంది. దివంగత ఎమ్మెల్యే సాయన్న వర్గీయులు సైతం పలు వార్డుల్లో పోటీకి సిద్ధంగా ఉండగా, ప్రస్తుతం వారి పోటీపై నీలి నీడలు అలుముకున్నాయి. రెండో వార్డు నుంచి టీఎన్ శ్రీనివాస్ పోటీకి సిద్ధంగా ఉన్నప్పటికీ, సాయన్న వారసుల్లో ఒకరిని ఆ వార్డు నుంచి పోటీ చేయించే అవకాశాలున్నట్లు తెలుస్తోంది. నాలుగో వార్డులోనూ సాయన్న ప్రధాన అనుచరుడు పనస సంతోష్, ఏడో వార్డు నుంచి నాగినేని సరితలు పోటీకి సిద్ధమంటున్నారు.

బోర్డు ఉపాధ్యక్ష పదవిపై ..

1992, 2006 ఎన్నికల్లో ఒక్కో స్థానానికే పరిమితమైన బీజేపీ ఈ సారి ఏకంగా బోర్డు ఉపాధ్యక్ష పదవిని దక్కించుకుంటామనే ధీమాలో ఉంది. బోర్డు మాజీ ఉపాధ్యక్షుడిగా పనిచేసిన రామకృష్ణ, మరో ముగ్గురు మాజీ ఉపాధ్యక్షులు జంపన ప్రతాప్, సాద కేశవరెడ్డి, భానుక నర్మద బీజేపీలో చేరారు. అయితే జంపన ప్రతాప్ కొన్నాళ్లుగా పార్టీకి దూరంగా ఉంటున్నారు. కేశవరెడ్డి మాత్రం పార్టీ పెద్దలతో టచ్‌లో ఉంటున్నప్పటికీ స్థానికంగా రామకృష్ణతో పొసగక తటస్థంగా ఉన్నారు. మూడో వార్డులో బీఎన్ శ్రీనివాస్, ఐదో వార్డులో రామకృష్ణ సతీమణి అనూరాధ లేదా సామల విజయలక్ష్మి, ఆరోవార్డులో మాజీ ఉపాధ్యక్షురాలు భానుక నర్మద, ఏడో వార్డు కేబీ శంకర్ రావు, ఎనిమిదో వార్డులో శ్రీకాంత్ జైనపల్లి పోటీ చేసేందుకు సిద్ధమయ్యారు. కీలకమైన రామకృష్ణ నాలుగో వార్డు నుంచి పోటీ చేసే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది.

కాంగ్రెస్‌లో కానరాని స్పష్టత..

ఒకప్పుడు బోర్డు రాజకీయాల్లో తిరుగులేని ఆధిపత్యంలో కొనసాగిన కాంగ్రెస్ ఇటీవల డీలా పడిపోయింది. ఆ పార్టీలో అనైక్యతతో వివిధ వార్డుల నుంచి పోటీ చేసే అభ్యర్థుల విషయంలోనూ స్పష్టత కరువైంది. రెండో వార్డులో శ్యామ్‌సన్ రాజు, నాలుగో వార్డులో వెంకట్, డీబీ దేవేందర్, ఐదో వార్డులో గజ్వేల్ భరత్ మినహా ఇప్పటి వరకు మిగతా అభ్యర్థులెవరూ పోటీ చేస్తామనే సంకేతాలు కూడా ఇవ్వడం లేదు.

మళ్లీ మాకే మద్దతివ్వండి..



బీఆర్ఎస్ తాజా మాజీ బోర్డు సభ్యులు పార్టీ మద్దతు టెన్షన్ మొదలైంది. బీఆర్ఎస్ పార్టీ మద్దతుదారులుగానే గత బోర్డులో కొనసాగిన నేతలు ఈ సారీ పార్టీ మద్దతు తమకు ఉండేలా ప్రయత్నాలు చేస్తున్నారు. మొత్తం ఎనిమిది మాజీ సభ్యులకు గానూ ఇద్దరు బీజేపీలో చేరగా మిగిలిన ఆరుగురు కలిసికట్టుగా తమ పార్టీ అధినేతలను ప్రసన్నం చేసుకునే పనిలో పడ్డారు. బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్ రెడ్డి, మాజీ సభ్యులు పాండుయాదవ్, నళిని, లోకనాథం, ప్రభాకర్, శ్యామ్ కుమార్, ఐదోవార్డు బీఆర్ఎస్ నేత పెద్దాల నర్సింహ శనివారం మంత్రి మల్లారెడ్డి, బీఆర్ఎస్ మల్కాజిగిరి ఇంచార్జ్ మర్రి రాజశేఖర్ రెడ్డిను కలిసి రాబోయే ఎన్నికల్లోనూ తమకు మరో అవకాశం కల్పించాల్సిందిగా విన్నవించారు. త్వరలోనే మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, మైనంపల్లి హన్మంతరావును కలవనున్నట్లు ఆయా నేతలు వెల్లడించారు.

'గాంధీ' సెక్యూరిటీ గార్డుపై దాడి



గాంధీఆస్పత్రి: విధులు నిర్వహిస్తున్న సెక్యూరిటీ గార్డుపై రోగి సహాయకుడు దాడి చేసి గాయపర్చిన ఘటన గాంధీఆస్పత్రిలో జరిగింది. సూపరింటెండెంట్ రాజారావు, చిలకలగూడ సీఐ నరేష్ వివరాల ప్రకారం.. మంగళహాట్‌కు చెందిన మహేశ్వర్ (47) జీడీఎక్స్ సంస్థ తరుపున గాంధీ అత్యవసర విభాగం వద్ద సెక్యూరిటీగార్డుగా విధులు నిర్వహిస్తున్నాడు. శుక్రవారం రాత్రి 11.30 సమయంలో ఓ వ్యక్తి బలవంతంగా లోపలికి వెళ్లేందుకు యత్నిస్తుండా మహేశ్వర్ అడ్డుకుని విజిటింగ్ పాస్ చూపించమని అడిగాడు. సదరు వ్యక్తి వేరొకరి పాస్ చూపించగా, రోగి సహాయకునిగా ఒకరికి మాత్రమే అనుమతి ఇస్తామని చెప్పడంతో వాగ్వాదానికి దిగాడు. అసభ్యపదజాలంతో దూషిస్తూ అందుబాటులో ఉన్న కర్రతో తలపై కొట్టడంతో రక్తపు గాయాలయ్యాయి. తోటి గార్డులు చేరుకునేలోగా నిందితుడు అక్కడి నుంచి పరారయ్యాడు. మహేశ్వర్‌ను ఎమర్జెన్సీ విభాగంలో చేర్పించి చికిత్స అందించారు. బాధితుని ఫిర్యాదు మేరకు పుటేజీలను పరిశీలించామని, నిందితుడు కార్వాన్‌కు చెందిన వేణు (25)గా గుర్తించామని సీఐ నరేష్ తెలిపారు.

దాడులు సరికావు..

గాంధీఆస్పత్రి: నిరుపేద రోగులకు ఉచితంగా అత్యుత్తమ వైద్యసేవలు అందిస్తున్న గాంధీ వైద్యులు, సిబ్బందిపై దాడులకు పాల్పడడం సరికాదని సూపరింటెండెంట్ రాజారావు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రాణాపాయస్థితిలో అత్యవసర, ఐసీయూ, విభాగాల్లో చికిత్స పొందుతున్న రోగులకు మరింత మెరుగైన వైద్యం అందించేందుకు ఒత్తిడిని అధిగమించి వైద్యులు, సిబ్బంది అహర్నిశలు కృషి చేస్తున్నారని అలాంటి వారిపై దాడులకు పాల్పడడం తగదన్నారు. ఇకపై దాడులకు పాల్పడితే క్రిమినల్ కేసులు నమోదు చేయిస్తామన్నారు.

బీఆర్ఎస్ హయాంలో రాష్ట్రం అధోగతి: కాంగ్రెస్



పాదయాత్ర చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

బన్సీలాల్‌పేట్: బీఆర్ఎస్ పాలనలో తెలంగాణ రాష్ట్రం అధోగతి పాలయిందని, రాష్ట్రంలో కుటుంబ పాలన సాగుతుందని కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు. హాత్ సే హాత్ జోడో కార్యక్రమంలో భాగంగా శనివారం రాంగోపాల్‌పేట్ డివిజన్‌లో నగర కాంగ్రెస్ ఉపాధ్యక్షులు డి.నాగేందర్ రాజ్ (రాజప్ప) అధ్వర్యంలో పాదయాత్ర నిర్వహించారు. ముందుగా చరిత్రాత్మకమైన మహంకాళి అమ్మవారి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సుభాష్ రోడ్డు, కుర్మబస్తీ, రాణిగంజ్, విక్టోరియాగంజ్ తదితర ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా నాగేందర్ రాజ్ ఎన్. విఠల్ మాట్లాడుతూ.. ఎందరో ఆత్మబలిదానాలు, త్యాగాలు, ఉద్యమాల కారణంగా ఆవిర్భవించిన ప్రత్యేక రాష్ట్రంలో కల్వకుంట్ల కుటుంబ పాలన సాగుతుందన్నారు. విచ్చలవిడిగా సాగుతున్న మద్యం అమ్మకాల కారణంగా అట్టడుగు వర్గాల కుటుంబాలు రోడ్డు పాలవుతున్నాయన్నారు. కాంగ్రెస్ పార్టీ పూర్వవైభవం దిశగా పార్టీ నాయకులు, కార్యకర్తలు కష్టపడి పనిచేస్తూ బీఆర్ఎస్ ప్రజావ్యతిరేక పాలనపై ప్రజలకు వివరించాలన్నారు.

'కాంగ్రెస్ విజయం ఖాయం'

రసూల్‌పురా: కంటోన్మెంట్ బోర్డు ఎన్నికల్లో కాంగ్రెస్ విజయకేతనం ఎగరేస్తుందని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి బొల్లు కిషన్ ధీమా వ్యక్తం చేశారు. గ్రేటర్ హైదరాబాద్ ప్రధాన కార్యదర్శి ఎంఏ. జమీల్ ఆధ్వర్యంలో శనివారం బోర్డు మూడవ వార్డు కార్ఖానలో జరిగిన హాత్ సే హాత్ జోడోలో బొల్లు కిషన్ పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్‌కు కంచుకోటగా ఉన్న కంటోన్మెంట్‌లో పార్టీకి పూర్వ వైభవం తీసుకొస్తామన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలపై ఉన్న ప్రజా వ్యతిరేకతతో అన్ని వార్డుల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు గెలుస్తారని అన్నారు. హాత్ సే హాత్ జోడోలో భాగంగా ప్రతి ఇంటికెళ్లి పార్టీ అధినేత రాహుల్‌గాంధీ, టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ప్రజల కోసం శ్రమిస్తున్న విషయాన్ని వివరిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో దేవందర్, ప్రేమ్‌లాల్, ఆయూబ్‌ఖాన్, సదానంద్, సాంసన్‌రాజు, నర్సింహ్మన్ కన్నన్ పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యం

సనత్‌నగర్: ఈఎస్ఐసీ బీమా దారులకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా వారికి అనుగుణంగా ఎప్పటికప్పుడు మార్పులను తీసుకురావడం జరుగుతుందని ఆ సంస్థ వైద్య కళాశాల డీన్ డాక్టర్ మాధురీ శ్రీష్ కాటే పేర్కొన్నారు. ఈఎస్ఐసీ 72వ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకుని పక్షం రోజుల పాటు నిర్వహించే ప్రత్యేక కార్యక్రమాల ప్రారంభోత్సవం శనివారం జరిగింది. ఈ సందర్భంగా డీన్ మాట్లాడుతూ.. ఈఎస్ఐసీ 72వ వసంతంలోకి అడుగుపెడుతున్న సందర్భాన్ని పురస్కరించుకుని 60 ఏళ్ల పైబడిన వారికి ఈఎస్ఐసీ ద్వారా అందుతున్న చికిత్సల్లో భాగంగా పలు మార్పులు చేసినట్లు తెలిపారు. హోమ్ డ్రగ్ డెలివరీ పేరుతో చేపట్టిన కార్యక్రమం ద్వారా రోగులు ఆస్పత్రికి రాలేని పరిస్థితి ఉంటే, వారికి అవసరమైన మందులను ఇంటి వద్దకే పంపించడం జరుగుతుందన్నారు. అయితే హైదరాబాద్‌లోని బీమాదారులకు మాత్రమే ప్రస్తుతం ఈ సేవలను అందుబాటులోకి తీసుకురానున్నట్లు వివరించారు. పక్షోత్సవాల్లో భాగంగా అధునాతనమైన 5-జీ అంబులెన్స్ సేవలను కూడా ప్రవేశపెడుతున్నట్లు తెలిపారు. ఆస్పత్రికి దూరంగా ఉన్నప్పటికీ అంబులెన్స్‌లో ఉన్న సిబ్బంది ద్వారా క్లౌడ్ టెక్నాలజీ ఆధారంగా ఆస్పత్రిలోని వైద్యులు పర్యవేక్షించవచ్చని దీని ద్వారా అత్యవసర అంబులెన్స్ ఆస్పత్రికి చేరే లోపే వైద్యులు రోగి ఆరోగ్య పరిస్థితిని సమీక్షిస్తూ అందించాల్సిన తక్షణ వైద్య సహాయంపై సిబ్బందికి తగిన సూచనలు ఇస్తారన్నారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ డాక్టర్ రాధిక, తదితరులు పాల్గొన్నారు.



ప్రత్యేక కార్యక్రమాలను ప్రారంభిస్తున్న డాక్టర్ మాధురీ శ్రీష్ కాటే

అలైన్‌మెంట్ ప్రకారం పనులు జరగాలి



జోనల్ కమిషనర్ రవికిరణ్‌తో చర్చించిన మర్రి శశిధర్‌రెడ్డి

సనత్‌నగర్: ఎర్రగడ్డ-సనత్‌నగర్ ప్రధాన రహదారిలో అలైన్‌మెంట్ లేకుండా డివైడర్ నిర్మాణం చేపట్టడంతో ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయని మాజీ ఎమ్మెల్యే మర్రి శశిధర్‌రెడ్డి అన్నారు. నిర్దిష్టమైన అలైన్‌మెంట్ ప్రకారం పనులు జరిగేలా చర్యలు తీసుకోవాలని శనివారం ఆయన జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్ రవికిరణ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ముఖ్యంగా సనత్‌నగర్ నుంచి ఫతేనగర్ వెళ్లే బ్రిడ్జి ప్రవేశద్వారం వద్ద ప్రమాదాలు జరిగే ఆస్కారం ఉంటుందని సాంకేతికపరంగా చర్యలు చేపట్టి ప్రజల ప్రాణాలను కాపాడాల్సిన బాధ్యత జీహెచ్ఎంసీపై ఉందన్నారు. వెంటనే సాంకేతిక నిపుణులను సంప్రదించి పనులు చేస్తే బాగుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నేతలు శ్రీనివాసరావు, ఆకుల మహేష్, నరేందర్, కృష్ణకుమార్, వంశీకృష్ణ, కుషాల్ పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత



ఆర్థికసాయం అందజేస్తున్న పోలీస్ అధికారులు

బన్సీలాల్‌పేట్: ఆసీఫ్‌నగర్ పోలీసు స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పని చేస్తూ ఆకస్మికంగా మరణించిన వైడీ విశాల్ కుటుంబాన్ని శనివారం పలువురు పోలీస్ అధికారులు పరామర్శించారు. మోండా మార్కెట్ పోలీసు స్టేషన్ పరిధిలోని ఆదయ్యనగర్‌లోని విశాల్ కుటుంబ సభ్యులను జాయింట్ కమిషనర్ ఆఫ్ పోలీసు డీడీ గజారావు భూపాల్(ఐపీఎస్), ఆసీఫ్‌నగర్ పోలీసు స్టేషన్ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ శ్రీనివాస్, మహంకాళి ఏసీపీ రమేష్, మోండా ఇన్‌స్పెక్టర్ నాగేశ్వర్‌రావు పరామర్శించారు. ఆసీఫ్‌నగర్ పోలీసు సిబ్బంది తరపున రూ.లక్ష ఆర్థిక సహాయాన్ని విశాల్ కుటుంబీకులకు అందజేశారు.

సాయన్న విగ్రహావిష్కరణ ఏర్పాట్ల పరిశీలన

కంటోన్మెంట్: దివంగత ఎమ్మెల్యే సాయన్న విగ్రహావిష్కరణకు ఏర్పాట్లకు కసరత్తులు జరుగుతున్నాయి. సాయన్న అంతిమ సంస్కారాలు నిర్వహించిన మారేడుపల్లిలోని హిందూ శ్మశానవాటిక ఆవరణలో విగ్రహం ఏర్పాటు చేయనున్నారు. మార్చి 5న సాయన్న జయంతిని పురస్కరించుకుని విగ్రహావిష్కరణ కోసం బీఆర్ఎస్ నేతలు ప్రయత్నాలు చేస్తున్నారు. శనివారం పార్టీ నేతలు శ్మశాన వాటికను సందర్శించి ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో టీఎన్ శ్రీనివాస్, సంతోష్, సంతోష్ యాదవ్, భాస్కర్ ముదిరాజ్, శ్రీహరి, నాగేందర్, శంకర్, శ్మశాన వాటిక కమిటీ సభ్యులు వెంకటస్వామి, సదానంద్, లక్ష్మణ్, నర్సింగ్, కేశవ పాల్గొన్నారు.

- కంటోన్మెంట్ బోర్డు ఆధ్వర్యంలోనూ విగ్రహాన్ని ఏర్పాటు చేయాల్సిందిగా బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో మాజీ బోర్డు సభ్యులు సీఈఓ మధుకర్ నాయక్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. అయితే కంటోన్మెంట్ ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున అప్పటి వరకు ఎలాంటి నిర్ణయం తీసుకోలేమని సీఈఓ వారికి స్పష్టం చేశారు. మారేడుపల్లి జీహెచ్ఎంసీ పరిధిలోకి వస్తుందని, అక్కడ విగ్రహ ఏర్పాటుకు కోడ్ వర్తించదని పార్టీ నేతలు అంటున్నారు.

పౌష్టికాహార సరుకుల పంపిణీ

బౌద్ధనగర్: టీబీ వ్యాధిగ్రస్తులకు సహాయ సహకారాలు అందించేందుకు స్వచ్ఛంద సంస్థలు, సామాజిక సేవకులు ముందుకు రావడం అభినందనీయమని కార్పొరేటర్ కంది శైలజ అన్నారు. ట్రీట్‌మెంట్ యూనిట్ సికింద్రాబాద్ డీఎంసీ ఆధ్వర్యంలో శనివారం బౌద్ధనగర్‌లోని కమ్యూనిటీహాల్లో టీబీ వ్యాధిపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో కార్పొరేటర్ కంది శైలజ పాల్గొని మాట్లాడారు. టీబీ వ్యాధిగ్రస్తులకు ప్రతి నెల పౌష్టికాహారం అందించేందుకు ముందుకొచ్చిన జీరాహోం ఫౌండేషన్ ప్రతినిధి జేవియర్ మైకెల్‌ను అభినందనలు తెలిపారు. అనంతరం పౌష్టికాహారాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ విజయ్ కుమార్, ట్రీట్‌మెంట్ సూపర్‌వైజర్ ఏఎస్‌బి చారి, హెల్త్ విజిటర్ మహ్మద్ జలాల్, తులసి, బ్రహ్మజి పాల్గొన్నారు.

రూ.116 కోట్ల ఆస్తి పన్ను వసూలే లక్ష్యం

సనత్‌నగర్: బేగంపేట సర్కిల్‌లో ఈ ఏడాది రూ.116 కోట్ల ఆస్తి పన్ను వసూలు లక్ష్యంగా పెట్టుకున్నట్లు సర్కిల్ ఉప కమిషనర్ ముకుందరెడ్డి స్పష్టం చేశారు. సర్కిల్ కార్యాలయంలో బిల్ కలెక్టర్లతో శనివారం ఆయన సమావేశమై ఆస్తి పన్ను వసూళ్లపై దిశానిర్దేశం చేశారు. బేగంపేట సర్కిల్‌లో ఆస్తిపన్ను చెల్లించని 13,270 మందికి ఇప్పటికే రెడ్ నోటీసులు జారీ చేశామని మార్చి నుంచి వారెంట్ కూడా జారీ చేస్తామన్నారు. గతేడాది మార్చి 31 నాటికి రూ.82 కోట్ల పన్ను వసూలైందని ఈ ఏడాదిలో రూ.116 కోట్లు వసూలు చేస్తామన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించడం బాధ్యత

టీటీఐ ఏసీపీ శంకర్‌రాజు

సనత్‌నగర్: యుక్త వయస్సులో వేగం థ్రిల్‌నిస్తుందని, కానీ అదే వేగం ప్రాణాలను కూడా హరిస్తుందన్న విషయాన్ని గుర్తించుకోవాలని బేగంపేట ట్రాఫిక్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ (టీటీఐ) ఏసీపీ శంకర్‌రాజు అన్నారు. ఎస్ఆర్‌నగర్‌లోని లక్ష్య జూనియర్ కళాశాలలో శనివారం రోడ్డు సేఫ్టీ, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ.. ట్రాఫిక్ నిబంధనలను పాటించడం ద్వారా తమతో పాటు ఇతరులకు కూడా ఎలాంటి ప్రమాదం ఉండదన్నారు. వాహనాలను వేగంగా వెళ్లరాదని ట్రిబుల్ రైడింగ్, సెల్‌ఫోన్ డ్రైవ్ చేయవద్దని సూచించారు. ట్రాఫిక్ నిబంధనలు తాము పాటిస్తూనే తోటి వారికి తెలియజేసి ఆచరించేలా చూడాలని సూచించారు. దేశానికే యువతే కీలకమని, అలాంటి యువత ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ సమాజంలో స్ఫూర్తిగా నిలవాల్సిన బాధ్యత ఉందన్నారు. ఈ కార్యక్రమంలో టీటీఐ సిబ్బంది జ్యోతి, లక్ష్య జూనియర్ కళాశాల చైర్మన్ మురళీ వైట్ల, డైరెక్టర్ శివప్రసాద్‌లతో పాటు మాజీద్‌ఖాన్, చిరంజీవి, చక్రధర్ పాల్గొన్నారు.



ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పిస్తున్న శంకర్‌రాజు

పావనికి డాక్టరేట్



ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ ఇంగ్లిష్ విభాగంలో ఎస్. పావనికి పీహెచ్‌డీ డాక్టరేట్ డిగ్రీ లభించింది. ఇంగ్లిష్ ప్రొ.కేఎస్ సునీత పర్యవేక్షణలో 'ఇమెజెస్ ఆఫ్ న్యూ ఉమెన్.. ఎ స్టడీ ఆన్ సెలెక్టెడ్ ప్లేయిస్ ఆఫ్ గిరిష్‌కర్నాడ్ అండ్ మహేష్ దత్తనీ' అనే అంశంపై చేసిన పరిశోధనకు డాక్టరేట్ వరించింది. నగరంలోని వనస్థలిపురానికి చెందిన పావని ఎంఏ ఇంగ్లిష్‌లో రెండు బంగారు పతకాలు సాధించినట్లు తెలిపారు.

తుకారాంగేట్‌లో ప్రజా గోస-బీజేపీ భరోసా

అడ్డగుట్ట: కేంద్రం అందిస్తున్న పథకాలను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షుడు కన్నాభిరాం పేర్కొన్నారు. తుకారాంగేట్‌లోని సాయి నగర్‌లో నిర్వహించిన ప్రజా గోస- బీజేపీ భరోసా కార్నర్ మీటింగ్ ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రజా సమస్యల పరిష్కారంతో రాష్ట్రం విఫలమైందని అడ్డగుట్టలో డబుల్ బెడ్రూమ్ నిర్మిస్తామని చెప్పిన ఎమ్మెల్యే దాని ఊసే మరిచారని ఆరోపించారు. పేద ప్రజల సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం స్ట్రీట్ వెండర్, ముద్ర లోన్లు అందిస్తుందన్నారు. సికింద్రాబాద్ పార్లమెంట్ పరిధిలో 17 చోట్ల స్కిల్ ట్రైనింగ్స్ జరుగుతున్నాయన్నారు. ఈ సమావేశంలో సారంగపాణి, కృష్ణమూర్తి, మహేష్ గౌడ్, గణేష్, జ్ఞానేశ్వర్, వీరన్న పాల్గొన్నారు.

సాయన్న చొరవతో చెక్కులు మంజూరు

కుమార్తెల అందజేత

కంటోన్మెంట్: దివంగత ఎమ్మెల్యే సాయన్న సిఫారసుతో మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఆయన కుమార్తెలు లాస్య నందిత, నివేదిత శనివారం కార్ఖానాలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో 16 మందికి అందజేశారు. సాయన్న ఆఖరి క్షణాల్లో ఐసీయూలో ఉండి సైతం సీఎంఆర్ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు అందజేయాల్సిందిగా పీఏకు సూచించిన విషయాన్ని గుర్తు చేసుకున్నారు. సాయన్నను నమ్ముకుని ఆపత్కాలంలో ఉన్న లబ్ధిదారులకు సకాలంలో సాయం అందాలన్న తలంపుతోనే చెక్కుల పంపిణీ చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జై ప్రకాశ్, బీఆర్ఎస్ నేతలు టీఎస్ శ్రీనివాస్, సదానంద్ గౌడ్, ఆనంద్ బాబు, భాస్కర్ ముదిరాజ్, నాగినేని సరిత, సానాది శ్రీనివాస్ పాల్గొన్నారు.



చెక్కులు అందజేస్తున్న సాయన్న కుమార్తెలు

రైలెక్కుతుండగా జారిపడి వ్యక్తి మృతి

అడ్డగుట్ట: రైలు ఎక్కుతుండగా జారిపడి గాయపడిన వ్యక్తి మృతి చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన సికింద్రాబాద్ జీఆర్పీ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. రాజస్థాన్‌కు చెందిన నార్పల్ సింగ్ (45), ఢిల్లీకి వెళ్లేందుకు ఈ నెల 25న సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కు వచ్చాడు. ప్లాట్‌ఫాం 1లో తెలంగాణ ఎక్స్‌ప్రెస్ రైలులో జనరల్ బోగీ ఎక్కాడు. లోపల రద్దీ ఉండడంతో జరిగిన తోపులాటలో ప్రమాదవశాత్తు జారీకింద పడ్డాడు. తీవ్రంగా గాయపడిన నార్పల్ సింగ్‌ను గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు.

పట్టాలు దాటుతుండగా మరొకరు..

అడ్డగుట్ట: పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. రైల్వే పోలీసుల వివరాల ప్రకారం.. లాలాపేటలోని శాంతినగర్ ప్రాంతానికి చెందిన తాళ్లపల్లి రవీందర్(41), పెయింటర్ పని చేస్తుంటాడు. ఈ నెల 24న రాత్రి సమయంలో లాలాగూడ-సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ల మధ్యలో పట్టాలు దాటుతుండగా రైలు ఢీ కొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు రవీందర్‌ను గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం తెల్లవారుజామున మృతి చెందాడు.

ఓయూలో భూకబ్జాకు యత్నం

అడ్డుకున్న విద్యార్థులు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ యూనివర్సిటీ భూమి కబ్జాకు యత్నించగా విద్యార్థులు అడ్డుకున్నారు. శనివారం హబ్సిగూడ వైపు గల పీ అండ్ టీ కాలనీకి ఆనుకొని ఉన్న 3,500 గజాల స్థలాన్ని కబ్జాచేసి కంచె ఏర్పాటు చేశారు. విషయం తెలుసుకున్న బీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వేల్పుల సంజయ్, ఓయూ జాక్ చైర్మన్ కొత్తపల్లి తిరుపతి ఘటనా స్థలానికి చేరుకుని పనులను అడ్డుకున్నారు. అనంతరం కూలీలను ప్రశ్నించగా బంజారాహిల్స్‌కు చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి పని చేయిస్తున్నట్లు చెప్పారు. విద్యార్థులు సెక్యూరిటీ సిబ్బంది సహకారంతో సిమెంట్ పోల్స్‌ను తొలగించారు. ఓయూ భూముల పట్ల అధికారుల నిర్లక్ష్యం తగదని రియల్టర్ ఆక్రమిత స్థలంలో అంబేద్కర్ రీసెర్చ్ సెంటర్‌కు భవనాన్ని నిర్మించాలని విద్యార్థులు డిమాండ్ చేశారు.



సిమెంట్ పోల్స్ తొలగిస్తున్న దృశ్యం